క్లుప్తంగా

ఏడీఆర్‌పై చర్యలు తీసుకోవాలి



ఆర్‌ఏఆర్‌ఎస్ వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

నంద్యాల(రూరల్): కాంట్రాక్ట్ కార్మికుల పట్ల నియంతృత్వ వైఖరి చూపుతున్న ఏడీఆర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోట మద్దులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, మహమ్మద్ గౌస్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం (ఆర్‌ఏఆర్‌ఎస్) ఎదురుట కాంట్రాక్ట్ కార్మికులతో సీఐటీయూ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్‌ఏఆర్‌ఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులని పాత పద్ధతిలోనే పనులు చేయించుకోవాలని కోరారు. కార్మికులకు సంబంధించిన పీఎఫ్‌లో లోటుపాట్లు పరిష్కరించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు 80 మందికి పైగా పాల్గొన్నారు.

జాబ్‌కార్డు కలిగిన వారందరికీ పని

ఉయ్యాలవాడ: జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు కలిగిన ప్రతి వ్యవసాయ కూలీకి పనులు చూపించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై వుందని ఏపీఓ రవిప్రకాష్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కొన్ని గ్రామాల్లో పనులులేక వలస పోతున్నట్లు ఉన్నతాధికారులకు నివేదికలు అందాయన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయిలో కూలీలకు అవగాహన కల్పించి, ఉపాధిలో పనులు చూపాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు.

కొనసాగుతున్న ఆధార్ క్యాంపులు

దొర్నిపాడు: మండలంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు కొనసాగుతున్నట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. బుధవారం క్రిష్టిపాడు, కొండాపురం గ్రామాల్లో క్యాంపులు నిర్వహించామన్నారు. సుమారు 55 మంది ఆధార్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకున్నారని చెప్పారు. క్రిష్టిపాడులో గురువారం కూడా ఆధార్ సేవలు కొనసాగుతాయని చెప్పారు. జిల్లా మార్పుకోసం అధిక సంఖ్యలో వస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

శిరివెళ్ల: అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న వర్కర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తు గడువు పెంచినట్లు ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సువర్ణలత బుధవారం తెలిపారు. గుంప్రమాన్‌దిన్నె అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ పోస్టు, గుండంపాడు ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 21 వరకు గడువు ఉండేదని, అయితే ఈ నెల 25వ వరకు గడువు పెంచారని చెప్పారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను ఐసీడీఎస్ ఆళ్లగడ్డ ప్రాజెక్ట్ కార్యాలయానికి పంపాలన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

నంద్యాల (వ్యవసాయం): ఈనెల 25వ తేదీన ప్రయాణికుల సమస్యలు పరిష్కరించడానికి డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ గంగాధర్ రావు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు, సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ఈ నెల 25న ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణికులు సెల్ : 9959225800 నంబర్‌కు కాల్ చేసి సమస్యలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



పెద్దయమ్మనూరులో మిరప పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఉయ్యాలవాడ : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని ఆత్మ ప్రాజెక్ట్ వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ అన్నారు. బుధవారం మండలంలోని బోడెమ్మనూరు, పెద్దయమ్మనూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మిరప పంటలను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మొక్కలు వాడిపోయి తలలు వాలి వున్నాయని, వీటి నివారణ కోసం ఒక లీటర్ నీటిలో 5 గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్ కలిపి మొక్కలపై పిచికారీ చేయాలన్నారు. వేరు తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉన్నందున పంటలో నీటి నిల్వలు లేకుండా బయటకు పంపాలని సూచించారు.

పౌష్టికాహారం అరకొర

- కేంద్రాలకు పూర్తి స్థాయిలో అందని పోషకాహారం
- ఈనెల సరఫరా కాని పాలు, కందిపప్పు
- 3, 4 విడతలకు సంబంధించి ఇంతవరకూ సరుకులివ్వని వైనం
- సరుకులు ముట్టినట్లుగా సంతకాలు తీసుకున్న అధికారులు
- తనిఖీ చేస్తే తమ పరిస్థితి ఏమిటని భయాందోళనలో కార్యకర్తలు

రుద్రవరం: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సకాలంలో సరుకులు అందక గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూలు చిన్నారులు, టీహెచ్‌ఆర్ పిల్లలకు పౌష్టికాహారం అందిచేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇదిగో వస్తున్నాయి అంటున్నారే తప్ప.. సరుకులు మాత్రం అందించడంలేదు. కోడి గుడ్లు, పాలు, బాలామృతం, కందిపప్పు వంటివి కేంద్రాల్లో కురువయ్యాయి. ప్రభుత్వ మారినప్పటి నుంచి ఇదే పరిస్థితి ఉందని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు లబోదిబోమంటున్నారు. ఈ నెలలో మూడు, నాలుగో విడతలకు సంబంధించిన పోషకాహారం ఇంతవరకూ కేంద్రాలకు చేరలేదు. పైగా సరుకులు ముట్టినట్లు అధికారులు ముందుగానే సంతకాలు చేయించుకోవడంతో తనిఖీ అధికారులొస్తే తమ పరిస్థిట ఏమిటని ఆందోళనకు గురవుతున్నారు.



నర్సాపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

వచ్చిన సరుకులు పిల్లలకు సర్దుబాటు..

మండలంలో మెయిన్, మినీ అన్ని కలిపి 60 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో గర్భిణులు, బాలింతలు 751 మంది, రెగ్యులర్‌గా కేంద్రాలకు వచ్చే ప్రీ స్కూల్ పిల్లలు 786, టీహెచ్‌ఆర్ (పుట్టిన బిడ్డకు 7వ నెల నుంచి 3ఏండ్లవరకు) పిల్లలు 1820 ఉన్నారు. వారందరికీ ప్రతి నెలా 1, 2, 3, 4 విడతల్లో ఒక్కొక్కరికి 25 కోడి గుడ్లు, 2.5లీటర్ల పాలు, చిక్కీలు, బాలమృతం వంటి పోషకాహారం అందించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పోషకాహారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఈ నెల 1, 2 విడతలకు సంబంధించిన గుడ్లు మాత్రమే సరఫరా అయ్యాయి. ఈనెలకు సంబంధించి పాలు, కందిపప్పు ఇంతవరకూ సరఫరా చేయలేదు. వచ్చిన వాటిని ప్రీ స్కూలు పిల్లలకు మాత్రమే ఇస్తున్నారు. దీంతో గర్భిణులు బాలింతలు, టీహెచ్‌ఆర్‌లు పస్తులు ఉండాల్సి వచ్చింది. ఈ నెలలోనే 3, 4 విడతలకు సంబంధించిన పోషకాహారం వస్తే వారికి సర్దుబాటు చేయాలని కార్యకర్తలు వేచి ఉన్నారు.

ముట్టినట్లు ముందుగానే సంతకాలు..

ఈనెలలో 23 రోజులు గడిచిపోయినప్పటికీ మూడో వారం, నాలుగో వారానికి సంబంధించిన సరుకులు అందించలేదు. పైగా నాలుగు రోజుల క్రితం అన్ని సరుకులు కేంద్రాలకు వస్తున్నాయని ముందుగా ఆన్‌లైన్‌లో అవి ముట్టినట్లుగా సంతకాలు చేయాలని సూపర్‌వైజర్ చెప్పడంతో కార్యకర్తలందరూ డిజిటల్ సంతకాలు చేశారు. దీనిని బట్టీ రికార్డుల పరంగా చూస్తే కేంద్రాల్లో పూర్తి స్థాయిలో పోషకాహారం ఉన్నట్టే.. కాని కేంద్రాల్లో చూస్తే అంతా ఖాళీ. పరిస్థితి చూసి కార్యకర్తలు భయాందోళన చెందుతున్నారు. ఎవరైనా పై స్థాయి అధికారలు తనిఖీలు చేస్తే తమ పరిస్థితి ఏమిటని బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

ప్రస్తుతం గుడ్లు మాత్రమే సరఫరా..

సరుకుల విషయంపై సూపర్‌వైజర్ లక్ష్మీదేవిని వివరణ కోరగా సరుకులు ముట్టినట్లు రిసీవ్డ్ సంతకాలు చేయమని ఎవరిపై ఒత్తిడి తీసుకురాలేదన్నారు. ప్రస్తుతం మూడు, నాలుగో విడత కోడి గుడ్లు సరఫరా మాత్రమే మొదలైందని తెలిపారు.

రిడోమిల్ గోల్డ్‌తో నల్లకాడ తెగులు నివారణ



పొగాకు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నంద్యాల(అర్బన్): రిడోమిల్ గోల్డ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే పొగాకు పంటకు సోకిన నల్లకాడ తెగులును నివారించుకోవచ్చని ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు రామకృష్ణ, పుల్లిబాయ్ తెలిపారు. ఆర్‌ఏఆర్‌ఎస్ దత్తత గ్రామంలో పులిమద్ది గ్రామంలో పొగాకు పంటలను బుధవారం పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న అధిక వర్షాలకు పొగాకు ఆకులు వడలిపోయాయన్నారు. నివారణకు 19-19-19 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే కప్పకన్ను తెగులు నివారణకు డైఫేనకొనజోల్, ప్రొఫినోకొనజోల్ 1ఎంఎల్ లీటరు నీటికి కలిపి స్ప్రే చేయాలని, లద్దె పురుగు నివారణకు కోరాజన్ 0.4ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి కాపాడుకోవచ్చని చెప్పారు. వీఏఏ సురేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ టౌన్‌హాల్ సందర్శన



ఆర్‌డీఓతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌ను జిల్లా కలెక్టర్ రాజకుమారి బుధవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. పట్టణ నడి మధ్యన విశాలంగా ఉన్న మున్సిపల్ టౌన్‌హాల్‌ను ఎందుకు నిరుపయోగంగా ఉంచారని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ టౌన్‌హాల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. టౌన్‌హాల్‌లో డయాస్, సీటింగ్ అరేంజ్‌మెంట్, లైట్లు, ఫ్యాన్లు, టాయిలెట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ తదితర మరమ్మతులు ఏమైనా ఉంటే వివరాలు ఇవ్వాలని చెప్పారు. నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జున్ రెడ్డి, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

గ్రామ సభకు 51 దరఖాస్తులు

నంద్యాల(అర్బన్): మండలంలోని బిల్లలాపురం గ్రామంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ రమణమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి 40 మంది రైతులు వివిధ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ రామసంజీవరావు, రామచంద్రారావు, సర్వేయర్ సహదేవుడు పాల్గొన్నారు.

గోస్పాడు: మండలంలోని కానాలపల్లె గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభకు 51 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం పొలాల్లో రీ సర్వే నిర్వహించిందని, అందులో విస్తీర్ణం ఎక్కువ తక్కువలకు 23, మ్యూటేషన్‌కు 5, పేరు తప్పులకు 3, విభజన సమస్యలకు 10, కొరిలేషన్ సర్వే నంబర్‌కు 8, మల్టిబుల్ ఖాతాలకు 1, ఇతర సమ స్యలకు 1 చొప్పున దరఖాస్తులు అందాయని చెప్పారు. కాగా.. గురువారం ఎం.చింతకుంట్లలో గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న అధికారులు

ఆర్టీసీ సిబ్బందికి ప్రోత్సాహకాలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్టీసీ డిపోకు అత్యధిక ఆదాయం తెచ్చిన ఆదర్శ డ్రైవర్లు, కండక్టర్లను డిపో ఆవరణలో డిపో మేనేజర్ గంగాధర్ రావు బుధవారం అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ సెప్టెంబర్ మాసంలో అత్యధికంగా ఆదాయం తెచ్చిన డ్రైవర్లు ప్రసాద్ సుబ్బయ్య డి.కాశీం, ఖాన్, కండక్టర్లు శేషన్న, హనీఫ్, ఇబ్రహీం, వెంకటేశ్వర్లుకు ప్రశంసా పత్రాలు అందజేశారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు, ఇంజినీరు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



ఆర్టీసీ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డిపో మేనేజర్ గంగాధరరావు

ఆ విద్యాసంస్థలను సీజ్ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): రేకుల షెడ్లలో నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల కోసం నిరంతర పోరాటం చేసే వామపక్ష విద్యార్థి సంఘాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం బాధాకరమన్నారు. జిల్లా వ్యాప్తంగా జిల్లాలో నకిలీ విద్యార్థి సంఘాలు ఉన్నాయనే వ్యాఖ్యలపై ఖండిస్తున్నామన్నారు. పాఠశాలలకు వచ్చి ఎవరు బెదిరించారో నిర్భయంగా తెలియజేయాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తే.. బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేయడం దారుణమన్నారు. కొందరు నిబంధనలకు వ్యతిరేకంగా ఫీజులు వసూలు చేస్తూ, రేకుల షెడ్లలో పాఠశాలలు నిర్వహిస్తూ, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నాయకులు రఫీ, ఎర్రిస్వామి, సాహిల్, నవీన్, హరి, వినయ్, నాయక్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఉయ్యాలవాడ: భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని ఇంజేడు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. గతంలో జరిగిన భూ రీ సర్వే అభ్యంతరాలపై గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 737 మంది రైతులకు సంబంధించి 3,328.97 ఎకరాల్లో భూముల రీసర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. గ్రామసభ ద్వారా పలువురు రైతులు అభ్యంతరాలు వెల్లడించారని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓ పురుషోత్తం, గ్రామ ఉప సర్పంచ్ మారంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరిస్తాం

దొర్నిపాడు: భూ రీసర్వేలో ఎమైనా పొరపాట్లు జరిగింటే గ్రామ సభల ద్వారా పరిష్కరిస్తామని డిప్యూటీ తహసీల్దార్ మాధవ్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని గుండుపాపల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో రైతుల నుంచి 43 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగప్రసాద్, వీఆర్‌ఓ మురళీమోహన్, గ్రామ సర్పంచి వెంకటేశ్వర్లు, కాశీవిశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఆళ్లగడ్డ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, చదువుతో పాటు సమాజ జ్ఞానంతోనే విద్యార్థులు సర్వతోముఖావృద్ధి చెందుతారని అయిదవ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షుడు ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ అన్నారు. పట్టణ శివారులోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను బుధవారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వసతి గృహంలో అందుతున్న వసతి, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అన్నారు. చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవడం సులభమన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఆర్‌వీవీఎస్ మురళీ కృష్ణ

బొగ్గులారీ బోల్తా

చాగలమర్రి: మండల కేంద్రంలోని కూలూరు రస్తా వద్ద జాతీయ రహదారిపై బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ ప్రమాద వశాత్తు బోల్తా పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ మురుగన్ స్వల్పంగా గాయపడ్డాడు. చెన్నై నుంచి తెలంగాణాలోని షాద్‌నగర్‌కు బొగ్గు తీసుకెళ్తున్న ఏపీ 39 వీఎఫ్ 2328 నంబరు గల లారీ చాగలమర్రిలోని కూలురు రస్తా సమీపంలోని జాతీయ రహదారి వద్దకు చేరుకోగానే అదుపు తప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మురుగన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న టోల్ ప్లాజా సిబ్బంది ఘటనా స్థలానికి చెరుకొని మురగన్‌కు చికిత్స నిమిత్తం కేరళ ఆసుపత్రికి తరలించారు.



జాతీయ రహదారిపై బోల్తా పడిన బొగ్గు లారీ

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పలు క్రీడాంశాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం.కోటయ్య తెలిపారు. బుధవారం విద్యార్థులకు నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థినులు పందు, మనీషా, సమీరా అండర్-17 సాఫ్ట్‌బాల్, హరినారపుసింహ, సునీత అండర్-14 సాఫ్ట్ బాల్‌లో, చిన్న సంకీర్తన స్టాండ్ బై అండర్-17 హ్యాండ్‌బాల్, నవ్యశ్రీ, ఎం .షాహీద్‌లు అండర్-14 విభాగంలో ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులతో పాటు పీడీ దాదాపీర్, పీఈటీ భారతిలను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం కోటయ్య, ఉపాధ్యాయులు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

శిరివెళ్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు విన్నవించారు. పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్లు, స్థలాలు, శ్మశానా వాటికలు కావాలని 124 అర్జీలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ యామా గుర్రప్ప, బీ.ఫీదా పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించుకుంటున్న ప్రజలు

బ్యాంకు లావాదేవీలపై అవగాహన

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు బ్యాంకు లావాదేవిలపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో వృత్తి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా ర్యాలీ నిర్వహించి, స్థానిక ఏపీజీబీ బ్యాంకును సందర్శించారు. బ్యాంకు మేనేజర్ సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది విద్యార్థులకు బ్యాంకు లావాదేవిలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవీంద్రారెడ్డి, బాలయ్య, మాబాషా, కుమార్ పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

రుద్రవరం: మండల పరిధిలోని మందలూరు గ్రామానికి చెందిన కిషోర్‌రెడ్డి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ వరప్రసాదు బుధవారం తెలిపారు. కొద్ది రోజులుగా అతను తన ఇంటి వద్దనే మద్యం సీసాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. నిందితుడు 17 క్వార్టర్ సీసాలతో పట్టుబడినట్లు తెలిపారు.

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల డిపోకు చెందిన అద్దె ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కర్నూలులో దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఆర్టీసీ ఆర్ఎం రజియా సుల్తానాకు హయ్యర్ బస్సెస్ జిల్లా సంఘం నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ నాయకులు రఘురామ కృష్ణారెడ్డి, సుదర్శన్ మాట్లాడుతూ మంగళవారం మధ్యాహ్నం కర్నూల్ గాయత్రి ఎస్టేట్ వద్ద మోటరసైకిల్‌పై మద్యం సేవించిన ఇద్దరు వ్యక్తులు హయ్యర్ ఆర్టీసీ బస్సు అడ్డంగా రావడంతో డ్రైవర్ శివ లింగమయ్య హారన్ కొట్టి మందలించడంతో అగంతకులు ఆవేశంతో మోటార్ సైకిల్‌పై బస్సును వెంబడించి డ్రైవర్‌పై దాడి చేశారన్నారు. తీవ్రగాయలపాలైన డ్రైవర్‌ను ఆర్టీసీ సిబ్బంది కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారని చెప్పారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.ఆర్ఎం రజియా సుల్తానా స్పందిస్తూ.. జిల్లా పోలీసు అధికారులకు తెలియజేసి ఇలాంటి చర్యలు మరోసారి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. శేషావలి, బాషా, చంద్రుడు, శేఖర్, ఆంజనేయులు, రాజశేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్యార్మీ వేడుకలు

దొర్నిపాడు:మండలంలోని చాకరాజువేముల, డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామాల్లో గురువారం నుంచి గ్యార్మీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే దర్గాలను విద్యుత్ దీపాలతో సుందరీకరించి స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

గ్యార్మీ వేడుకలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ వెంకటేష్ సూచించారు. చాకరాజువేముల, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల్లోని దర్గాలను సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. ఎదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



డబ్ల్యూ గోవిందిన్నెలో ప్రత్యేక అలంకరణలో దస్తగిరిస్వామి పీర్లు

వదలని వర్షం

- 800 ఎకరాల్లో నేలవాలిన వరి
- లబోదిబోమంటున్న రైతులు

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో 10 రోజులుగా కురుస్తున్న వర్షానికి పంటలన్నీ దెబ్బతింటున్నాయి. దిగుబడులు చేతికొచ్చే సమయంలో వర్షం ముంచేస్తోందని రైతులు విలవిల్లాడుతున్నారు. మంగళవారం సాయంత్రం చీకటి పడే సమయంలో పెద్దగా గాలులు వీస్తూ వర్షం కురిసింది. ఆ గాలి వానకు మండంలో దాదాపు 800 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. బుధవారం ఉదయాన్నే పొలాల వైపు వెళ్లిన రైతులు అక్కడి పరిస్థితిని చూసి కుదేలయ్యారు. కంకి దశలో ఉన్న వరి నేలవాలగా ఆ పైరుపై నుంచే వర్షపు నీరు పారుతుండటంతో ఇంకేం దిగుబడులు వస్తాయని ఆవేదన చెందారు. పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని, తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తోందని రుద్రవరం, అప్పనపల్లె, కొండమాయపల్లె, వెలగలపల్లె తదితర గ్రామాల రైతులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారులను సంప్రదించగా దెబ్బతిన్న పంటలను పరిశీలించామని దాదాపు 800 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామన్నారు. వారి నుంచి ఆదేశాలు రాగానే క్షేత్ర స్థాయిలో పరిశీలించి నష్టాన్ని పక్కాగా అంచనావేస్తామని తెలిపారు.



అప్పనపల్లె దారిలో నేలవాలిన వరి పైరు

నీట మునిగిన పైర్ల పరిశీలన



నీట మునిగిన పైర్లను పరిశీలిస్తున్న ఏఓ రంగనేతాజీ

చాగలమర్రి: గత పది రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలలో పంట చేలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. నీట మునిగిన పంట పొలాలను మండల వ్యవసాయాధికారి రంగనేతాజి బుధవారం పరిశీలించారు. చాగలమర్రిలోని పాత గోపాయపల్లె రస్తాలో అడ్డువాగు ఉధృతంగా ప్రవహించడంతో మొక్కజొన్న, కంది పంటలలో ఇప్పటికీ నీరు నిలిచి పంటలు దెబ్బతిన్నాయి. పొలాల్లో వర్షపు నీరు నిలిచి మొక్కలు కుళ్లి పోయి పంట నష్టం వాటిల్లిందని, వెంటనే నష్టం అంచానా వేసి ప్రభుత్వం ద్వారా పరిహారం మంజూరు చేయించాని రైతులు పక్రుద్దీన్, హుసేన్‌బాషా, రహంతుల్లా, మాబాషా మరికొంత మంది రైతులు ఏఓను వేడుకున్నారు.